కథ

# సుకుమారి

''అదుగో 'సుకుమారి' ఎంత వయ్యారంగా వస్తోందో చూడండి అంది రమణి. సుకుమారి కాలేజీ ఆవరణలోకి అడుగు పెట్టటాన్ని చూసి.

'వన్నెల విసనకర్రలా' మరో వ్యాఖ్యానం అందించింది వనజ. కాదే, 'సీతాకోక చిలకలా' వ్యంగ్యంగా అంది సుజాత.

తనను దూరం నుండి చూడగానే గుసగుసలాడుకోవటం గమనించింది సుకుమారి. అయినా తనకేమీ పట్టనట్టు, తనకనవసర విషయమన్నట్లు రిజిష్టరులో సంతకం పెట్టటానికి ప్రిన్స్‌పాల్ రూమ్‌లోకి వెళ్ళింది సుకుమారి.

''చూడండి, మనకు విష్ కూడా చెయ్యలేదు. ఎంత నిర్లక్ష్యమో మనమంటే. ఏం చూసుకునో ఆ పొగరు. నలభై ఏళ్ళు వచ్చినా పెళ్ళీ పెటాకులు లేకుండా షోకులాడిలా వస్తుంది'' అక్కసుగా అంది, చిన్నతనంలోనే కులమింటి కోతితో ముడిపెడితే ఇరవై రెండేళ్ళకే ముగ్గురు పిల్లల తల్లయిన వనజ.

''ఆ... ఈ వృద్ధకుమారిని ఇంకెవరు చేసుకుంటారే? చిన్నదానిలా కన్పించాలని ఆవిడ గారు చేసే ప్రయత్నం ఎవరికి తెలియదనీ, తలను 'డై' చేసుకుని, వాలుజడ వేసుకుని, చిన్నవాళ్ళు కట్టుకునే చీరెలు సింగారించినంత మాత్రాన చిన్నదైపోతుందా? అందగత్తెగా మారిపోతుందా?'' తన భారీకాయాన్ని కప్పి పుచ్చుకోవటానికి చేసే ప్రయత్నాన్ని సరి చూసుకుంటూ అంది రమణి.

ఎవరిష్టమొచ్చినట్లు వారు తమ కుసంస్కారాన్ని బయట పెట్టుకున్నా, అసలు సుకుమారి సిన్సియారిటీ గురించి అందరికీ తెలుసు. కాలేజీ స్టూడెంట్స్ ఆమె పట్ల చూపించే అభిమానం, ప్రిన్స్‌పాల్‌గారు ఆమెను గౌరవించే విధానం, మేనేజ్‌మెంటుకు గల సదభిప్రాయం ఎవరికీ తెలియంది కాదు. కాకపోతే ఆమె అందంగా ఎందుకు తయారు కావాలి? అనేదే వారి దుగ్ధ.

నిజమే.

సుకుమారికి 40 సంవత్సరాలు దాటాయి. చామన చాయ. ఇప్పటికి చూట్టానికి అందంగా కన్పిస్తుంది. పెళ్లి కాలేదు కాబట్టి, మరీ పెద్దదానిలా కన్పిస్తే పెళ్లి కాదన్న ఉద్దేశంతో అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలకు కలర్ వేసుకుంటుంది. పెద్దరికాన్నిచ్చే చీరెలు కాకుండా, పాతికేళ్ళ వాళ్ళు కట్టే చీరలు, చక్కటి చీరెలు కట్టుకుంటుంది. అట్లాగని వెకిలి వేషధారణ సుకుమారిలో కన్పించదు. చూడగానే 10 సంవత్సరాల వయసు తక్కువ దానిలా కన్పిస్తుంది. అంతే.

సుకుమారి జీవితంలో అనేక ఒడిదుడుకుల్ని ఎదుర్కొన్నది కాబట్టి, తన కొలీగ్స్ మాటల్ని పట్టించుకోదు. తనలో మాలిన్యం లేనంతకాలం తలవంచు కోవాల్సిన అవసరం లేదనుకుంటుంది.

తండ్రి రాములుది పండ్ల వ్యాపారం. చిన్న చెక్కబండి మీద వ్యాపారం సాగించి పండ్ల దుకాణం పెట్టేవరకు సాధించాడు. ఇల్లు నడపటానికి, రోగిష్టి తండ్రికి మందులిప్పించటానికి, ఇద్దరు కొడుకులను టీచరు ట్రైనింగ్ వరకు చదివించటానికి అతని సంపాదన బాగానే సరిపోయేది. అయినా, ముందు చూపుతో జాగ్రత్తపడి కుటీరం లాంటి చిన్న ఇంటిని కట్టుకున్నాడు.

తనకింత నీడ కల్పించిన పండ్ల దుకాణాన్ని ఎంతో జాగ్రత్తగా చూసుకునేవాడు. రాములు దుకాణంలోని పండ్లంటే అవి తాజాగా ఉంటాయి అనే పేరు సంపాదించుకున్నాడు. పండ్లను దిగుబడి చేసుకోవటం, ఎండకు వాడకుండా చల్లదనాన్ని సమకూర్చటం, చెడిపోతున్న పండ్లను వేరు చేయటం, బేరగాళ్ళకు సరసమైన ధరకు అమ్ముతూనే తన లాభాన్ని చూసుకోవటం వంటివి ఎన్నింటినో ఓర్పుతో నిర్వహించుకుంటూనే రోగిష్టి తండ్రిని, వృద్ధాప్యంతో పోరాడి ఓడిపోయిన తల్లిని కడతేర్చాడు.

కొడుకులిద్దరు జన్మతో సంక్రమించిన తక్కువ కులాన్ని సర్టిఫికేట్ రూపంలో, తమ క్వాలిఫికేషన్స్‌తో జత చేసి ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇష్టపడిన అమ్మాయిలతో వివాహం చేసుకుని ఉద్యోగరీత్యా దూరంగా వెళ్ళిపోయినా, వారి నుండేమీ ఆశించలేదు రాములు.

ఒక్కగానొక్క బిడ్డ సుకుమారి కూడా చదువులో పైకొస్తుంటే సంబరపడుతూనే ఒక అయ్యచేతిలో ఆమె చేతినుంచటం కోసం డబ్బును కూడబెట్టటం ప్రారంభించాడు.

చిన్ననాటి నుండి పడుతున్న శ్రమకు తట్టుకోలేని, వయసు మీద పడిన శరీరం జవసత్వాలకు దూరమవుతూనే 'క్యాన్సర్'కు ఆశ్రయమిచ్చింది. పెళ్లికోసం కూడబెట్టిన డబ్బు తన జబ్బుకోసం ఖర్చుకావటం ఇష్టం లేక మందులు వాడటం తగ్గించేసాడు.

విషయాన్ని గ్రహించిన సుకుమారి తండ్రి ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించింది. తండ్రి నిర్వాకం గురించి అన్నలిద్దరికీ ఉత్తరాలు వ్రాసింది. మళ్ళీ మందులు వాడించింది. అన్నలిద్దరూ వచ్చి చూసి తండ్రిని మందలించారు.

సుకుమారితో ''చెల్లీ! ఈ జబ్బుకు డబ్బుదాహం ఎక్కువ. ఎంత మింగించినా అయ్య మనకు దక్కడు. అయినా, ఇల్లు అమ్మేసి వైద్యం చేయిద్దాం'' అని రాములు ఎంత వారిస్తున్నా వినకుండా ఇల్లు అమ్మేసి ఆ పైకాన్ని చెల్లి చేతిలో పెట్టారు. ''మేముండే ఆ పల్లెటూళ్ళకంటే ఇక్కడే వైద్యం సాగుతుంది, మేము వచ్చి చూసి వెళ్తుంటాము'' అని ధైర్యం చెప్పి పండ్ల వ్యాపారాన్ని మరొకరికి అప్పజెప్పి, సుకుమారికి తోడుగా మనిషిని కుదిర్చి వెళ్ళిపోయారు.

తన కారణంగా గూడు లేకుండా పోయినందుకు గుండె నీరైంది రాములుకు. డబ్బంతా తన వైద్యం కోసమే వెచ్చిస్తుంటే తట్టుకోలేక పోయాడు. ''తల్లీ! గూడు లేకుండా చేసాను. తోడు కూడా నువ్వే వెతుక్కోవాలి'' అంటూ కన్నుమూసాడు.

అన్నలిద్దరు రమ్మని బ్రతిమాలినా, వారి దగ్గరకి వెళ్ళకుండా అక్కడే ప్రైవేటు కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం వెతుక్కుని గడుపుతోంది సుకుమారి. అన్నలు చేసిన ప్రయత్నాలు కూడా సుకుమారిని పెళ్లి కూతుర్ని చేయలేకపోయాయి. 'కాలం కలిసి రావాలని' నిర్లిప్తతను అలవాటు చేసుకుంది సుకుమారి.

కాలేజీలో ఒక్క పరశురామ్‌తో మాత్రమే ఫ్రీగా మాట్లాడుతుంది సుకుమారి. కుల, మతాల పట్టింపులతో గాక మనిషిని మనిషిగా గౌరవించగల ఆయన విశాల దృక్పథం సుకుమారికి ఎంతో నచ్చింది. రిటైర్ అయిన తర్వాత డబ్బు కోసమో, కాలక్షేపం కోసమో కాక విద్యాబోధనలో రిటైర్ కావటం ఇష్టం లేక పనిచేస్తున్న ఆయన ఉన్నతాశయం పట్ల సుకుమారికి గౌరవం ఉంది. సుకుమారికున్న డిగ్రీ భౌతికశాస్త్రంలో. అందుకు విరుద్ధమైన, సున్నితమైన సాహిత్యం గురించి అభిరుచి కలిగించిన వ్యక్తి పరశురామ్‌గారు. ఆయన సూచించిన పుస్తకాలు చదువుతూ, చర్చకు దిగుతుంటుంది. ఇది కూడా ఆమెతోటి ఉద్యోగినులకు కంటగింపైంది. 'రిటైర్ అయితేనేం? ఎర్రగా, బుర్రగా, రాయిలా ఉన్నాడని పట్టింది. ఇది మాత్రం చిన్నదా?' అనే స్థాయికి దిగజారినప్పటికి ఛీ! అనుకుందే గాని పరశురామ్‌గారితో స్నేహాన్ని మాత్రం విడిచిపెట్టలేదు.

కాని- తాను అద్దెకుంటున్న ఇంటి యజమాని తనను గమనించే హుందా అయిన చూపులో మాత్రం సుకుమారిలో కలవరం కలిగింది. ఆయన-విక్రమరావు-వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న 53 ఏళ్ళ మనిషి. భార్య మరణం తర్వాత కూడా కొడుకులిద్దరిని ఇంజనీర్లు చేసి, వారి ఇష్టప్రకారమే స్టేట్స్‌కు పంపించి తన ఆశయాన్ని నెరవేర్చుకున్న ధీశాలి. గొప్పవాళ్ళయిన కొడుకులు-లంకంత ఇల్లు-భార్య తప్ప ఏ లోటు లేని ఆయనకు ఉద్యోగం చేయాల్సిన అవసరం కాని, ఆసక్తిగాని లేక వాలెంటరీ రిటైర్‌మెంటు తీసుకున్నాడు. విజ్ఞుల ప్రసంగాలకు వెళ్తూ, చక్కని సాహిత్యాన్ని చదువుతూ, మంచి స్నేహితులతో కాలక్షేపం చేస్తూ, తోటపని చూసుకుంటూ కాలం గడుపుతున్నాడు. కాని, ఇన్ని సంవత్సరాల ఒంటరి ప్రయాణం తర్వాత ఆయన మనసు ఓ తోడుంటే బాగుండునన్న ఆలోచనకు వెళ్ళిపోయింది.

తన ఇంట్లో అద్దెకుంటున్న సుకుమారి కుమారేనని, కులం తక్కువదేనని తెలిసినా, వ్యక్తిత్వంలో, ప్రవర్తనలో ఆమె నిండు తనాన్ని గౌరవించారు. చిన్ననాడే తల్లిని పోగొట్టుకున్న బిడ్డలిద్దరిని పెంచేటప్పుడు కూడా, తనకో తోడును కట్టబెట్టాలని తన శ్రేయోభిలాషులు చేసిన ప్రయత్నం ఆయనలో చలనం కలిగించ లేదు. కాని, సుకుమారిని గమ

నించిన తర్వాత ఈ దశలో తనకు తోడు కాగలిగింది సుకుమారైతే బాగుండుననుకున్నా రాయన.

ముందుగా తన పిల్లలకు తన ఆలోచన నచ్చుతుందో లేదోనన్న శంక కలిగింది. వివరిస్తూ ఉత్తరం వ్రాసారు. అందుకు సమాధానంగా-

నాన్నగారూ!

మీరు ప్రస్తావించిన విషయం మాకెంతో ఆనందాన్ని కల్గించింది. మీరు సందేహించాల్సిన పనే లేదు. అమ్మ అంటే మాకు లీలగా మాత్రమే గుర్తు. ఆ స్థానాన్ని కూడా భర్తీ చేసుకుంటూ మీరు మమల్నింత వారిని చేసారు. ఈ వయసులో మీకు తోడు ఎంత అవసరమో మేము గ్రహించగలం. మా పెంపకంలో మీకా ఆలోచన అవసరం రాలేదు. మీకు దూరంగా ఉన్న మేము మీకే అవసరమైనా, మీరు కోరుకున్నప్పుడు మీకు అందుబాటులోకి రాలేకపోవచ్చు. మేము కూడా మీరు మెచ్చగల మన ఇండియా అమ్మాయిల్నే చేసుకుని ఇక్కడే సెటిల్ అయిపోదామనుకుంటున్నాము. వచ్చినా; తరుచూ రాలేం కదా!

కులం, మతం, అంతస్థు వీటన్నిటిని అధిగమించి ఆలోచిస్తూ ఒక నిర్ణయానికి వస్తున్న మీకు కొడుకులమైనందుకు మేమెంతో గర్వపడుతున్నాం. నాన్నగారూ! మనం భారతీయులం. అంతే. అదే మనం గుర్తుపెట్టుకుందాము.

మీ ఇద్దరి పెళ్ళి ఫోటో కోసం ఎదురు చూస్తూ శుభాకాంక్షలతో

విష్ణు, మూర్తి.



కొడుకులు తన నిర్ణయానికి వ్యతిరేకించరని తెలిసినా వారి ఈ సమర్థనకు విక్రమరావుగారికెంతో సంతోషం కలిగింది. అసలు సుకుమారి ఉద్దేశం ఏమిటో? తన ప్రపోజల్ను ఎలా అర్థం చేసుకుంటుందో? పెళ్లి చేసుకునే ఉద్దేశం ఉందో లేదో? ఈ ముసలాడికీ వయసులో ఈ యావ ఏమిటని తక్కువ అంచనా వేసుకోదు కదా?

అనేక ఆలోచనలతో సతమతమవుతూ-సరే, ఆమెనే తేల్చివేస్తుంది. అనుకున్నారాయన.

సాయంత్రం పూట తీరిగ్గా 'చలం' సాహిత్యాన్ని చదువుతున్న సుకుమారి గుమ్మం ముందు ఎవరో నిలబడినట్లనిపించే సరికి తలతిప్పి చూసింది. ఇంటి యజమాని విక్రమరావుగారని చూడగానే ఆశ్చర్యంతోనూ, గౌరవంతోనూ లేచింది.

"సుకుమారిగారూ! మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నాను కదూ?! ఏం లేదు. మా అబ్బాయిలు లెటర్ వ్రాసారు. మీకిద్దామని"- చేతిలోని కవరును అందించబోయారు.

కొడుకులు వ్రాసిన లెటర్ నాకెందుకివ్వటం?-' సంకోచించింది సుకుమారి.

"ఫరవాలేదు, చదవండి. మీ గురించిన విషయమే ఇందులోది. చదివి మీ నిర్ణయం తెలపండి"

"నా గురించా?" ఆశ్చర్యపోతూ తీసుకుంది సుకుమారి.

మరురోజు కవరును తిరిగి ఇచ్చేస్తుండగా అడిగారు విక్రమరావు "ఏమంటారని?"- ఔను.

తండ్రి కొడుకులు కలిసి తమ కుటుంబంలోకి ఇంత సాదరంగా ఆహ్వానిస్తుంటే అంతకంటే మించిన ఆప్యాయత, అవగాహన ఈ వయసులో తనకు మాత్రం ఎక్కడ దొరుకుతుంది?- మందహాసం చేసింది సుకుమారి.

సుకుమారి దరహాసం, ఆమెలో క్రొత్తగా కన్పిస్తున్న శోభ విక్రమరావుగారికి ఆమె అంగీకారాన్ని తెలియచేశాయి. తృప్తిగా, ఆనందంగా నవ్వారాయన కూడా.

★★★

మొదటిసారిగా తన దగ్గరికి వచ్చిన సుకుమారిని అబ్బురంగా చూసారు విక్రమరావుగారు.

స్పష్టంగా కన్పిస్తున్న నెరిసిన వెంట్రుకలతో చక్కగా పెద్ద ముడి వేసుకుని, పెద్దబార్డరు గల వెంకటగిరి జరీ తెల్ల చీరె, జరీ అంచున్న తెల్లజాకెట్లను ధరించి, పెద్దకుంకుమ బొట్టు పెట్టికొని, ఆనందంతో, తృప్తితో వెలిగిపోయే చిరునవ్వుతో, హుందాగా పెద్ద ముత్తయిదువలా కన్పిస్తున్న ఆమె రూపం- ఒకనాటి యవ్వనవతిగా కన్పించిన సుకుమారేనా- ఈ నా భార్య? అని అవాక్కయి చూడసాగారు విక్రమరావుగారు.

"ఏమిటీ! మాటలు మర్చిపోయారా?" ఆయన చేతినందుకుంటూ చిన్నగా నవ్వుతూ అంది సుకుమారి.

"ఔను..నువ్వు...నీ అలంకారం?"

"ఔనండీ. నేనే...నేనిప్పుడు కుమారి సుకుమారి అనే సామాన్యురాలిని కాదండి. రిటైర్డ్ విక్రమరావుగారి భార్యను. ఇద్దరు ఇంజనీర్ కొడుకులున్న తల్లిని" నిండుగా నవ్వుతూ అంది శ్రీమతి సుకుమారి.

తన చేతినందుకున్న సుకుమారి చేతిని తృప్తితో, ఆనందంతో నిమిరారు విక్రమరావుగారు.

తాను కోరుకున్న విధంగా, కోరుకున్న తోడు దొరికినందుకు ఆయన హృదయం ఉప్పొంగుతున్నందుకు నిదర్శనంగా పెరట్లోని సన్నజాతి పూలపై రాలిన చినుకులు జలజలా రాలాయి. ★

**డాక్టర్ వి.వాణీప్రసాద్**